క్లుప్తంగా

పట్టుదలతో చదవాలి



ధర్పల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని లిటిల్ హార్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు ఇన్‌స్పైర్ అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సంబంధించిన వక్తలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదివితే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చని తెలిపారు. సీఐ సైదు, ఎంఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ 4వ మహాసభలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ 4వ మహాసభలను జరిగాయి. ప్రొఫెసర్ ప్రభంజన్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై చాంపియన్‌లా పోరాటం చేయాలన్నారు. ఎకనామిక్స్ ప్రొఫెసర్ దత్తహరి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, తదితరులున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు సన్మానం



ఖలీల్‌వాడి: నగరంలోని కృష్ణ మందిరం చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ చందర్‌రాథోడ్‌లను నీలకంఠేశ్వర్ అపార్ట్‌మెంట్‌వాసులు సన్మానించారు. ప్రొద్దుటూరి నీలకంఠేశ్వర అపార్ట్‌మెంట్ వాసులు ఉమా మహేశ్వర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజేశ్వర్ రావు, తదితరులు ఉన్నారు.

జిల్లావాసికి పీహెచ్‌డీ ప్రదానం

నిజామాబాద్ అర్బన్: నగరంలోని గౌతమ్ నగర్‌కు చెందిన పడిగెల దశరథ్(టీచర్)కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ లభించింది. అర్థశాస్త్రం విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆయన పీహెచ్‌డీ పొందారు. రోల్ ఆఫ్ మైక్రో ఫైనాన్స్ ఇన్ పావర్టీ ఎలివేషన్ అనే విభాగంలో ఆయన పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం నవిపేటలోని మోడల్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



నిజామాబాద్‌నాగారం: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా నిర్మల్‌క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, నగర మేయర్ దండు నీతూకిరణ్‌లు గురువారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు.

అభివృద్ధిని కంటి వెలుగు అద్దాలతో చూడు



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ఎంపీ అరవింద్, ఆర్మూర్ నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని ప్రభుత్వం ఇచ్చే కంటి వెలుగు అద్దాలతో చూడాలని బీఆర్ఎస్ ఆర్మూర్ యువజన విభాగం నాయకులు అభిలాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇంకోసారి ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధిపై మా జీవన్ అన్నపై ఇష్టమచ్చినట్లు మాట్లాడితే ఖబర్దార్... అంటూ ఫైర్ అయ్యారు.

స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపు



ధర్పల్లి: మండల కేంద్రంలో ఈ నెల 22న జరిగే తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగే బీడీ కార్మికుల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సూర్య శివాజీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్పల్లి మండల కేంద్రంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడీ కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలిపారు.

గద్దె దించేందుకు సిద్ధం

- బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు విస్మరించింది
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలోని 28వ డివిజన్‌లో శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ



బర్ధిపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఖిల్లా రామాలయం 28వ డివిజన్‌లో ప్రజా గోస - బీజేపీ భరోసా శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి బూత్‌స్థాయి కార్యకర్తలే బలమని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీనిచ్చారు. నిరుద్యోగ యువతకు భృతి రూ.3016 ఇస్తానని మాట తప్పారని గుర్తు చేశారు. పావలా వడ్డీ రుణాలు ఇవ్వకపోవడంతో డ్వాక్రా మహిళలపై వడ్డీ భారం పడుతోందని చెప్పారు. ఉద్యోగులకు మొదటి తేదీన జీతాలు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్రం ఉందని, కేసీఆర్ రాష్ట్రాన్ని ఆగమాగం చేశారని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబానికి తప్ప మరొకరికి ఉద్యోగాలు రాలేదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెడితే రాష్ట్రంలో అమలు చేయకుండా పేదల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ సిలిండర్లు, ఉచిత బియ్యం, ఆవాస్ యోజన, ఇతర అనేక పథకాలు అమలుజేస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది లేక పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారని, మేయర్ భర్త అక్రమ కబ్జాలను అడ్డుకునే అధికారులు లేకుండా పోయారని, ఎదిరిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలంటే తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు రావాలని వ్యాఖ్యానించారు. నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, కేపీ రెడ్డి, ఇల్లెందుల మమత, పుట్ట వీరేందర్, బద్దం కిషన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బర్ధిపూర్‌లో కార్నర్ మీటింగ్

డిచ్‌పల్లి: బర్ధిపూర్‌లో డిచ్‌పల్లి బీజేపీ అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో బీజేపీ కార్నర్ మీటింగ్ జరిగింది. బర్ధిపూర్ నుంచి ధర్మారం, మెంట్రాజ్‌పల్లి, సాంపల్లి, సుద్దపల్లి, యానంపల్లి, సుద్దులం, కొరట్‌పల్లి, కొరట్‌పల్లి తండా గ్రామాలలో ప్రజా గోస-బీజేపీ భరోసా అనే నినాదంతో బైక్ ర్యాలీ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చని హామీల గురించి వివరిస్తూ బీజేపీ పార్టీలో బలోపేతం, కేంద్ర ప్రభుత్వ పతకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రూరల్ అసెంబ్లీ ఇన్‌చార్జి దినేష్ కులాచారి, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, రూరల్ ఏసీ కన్వీనర్ పద్మారెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామ్‌రావు,తదితరులున్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



స్నాక్స్ అందజేస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

మోపాల్(నిజామాబాద్‌రూరల్)/నిజామాబాద్అర్బన్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. గురువారం సాయంత్రం నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న స్నాక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువు విషయంలో ఉపాధ్యాయులు తలా కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకోవాలని, తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. శ్రద్ధగా చదువుకుని ఉత్తమ జీపీఏ పాయింట్లు సాధించాలని పేర్కొన్నారు. అలాగే నగరంలోని దుబ్బా ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు సూచనలు సలహాలిచ్చారు.

‘అనుమతులు వచ్చేలా కృషి చేస్తా’



వివరాలు తెలుసుకుంటున్న డీఎఫ్‌వో వికాస్ మీనా

సిరికొండ: అటవీ ప్రాంతం మీదుగా రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చేలా చూస్తానని డీఎఫ్‌వో వికాస్ మీనా తెలిపారు. హన్మునాయక్ తండా, సుభాష్ తండా, బాల్‌రాజ్ తండా మీదుగా పాకాల రోడ్డు వరకు నిర్మించనున్న రోడ్డును డీఎఫ్‌వో గురువారం పరిశీలించారు. ఈ రోడ్డు అటవీ ప్రాంతం మీదుగా ఉండటంతో నిధులు మంజూరైనా అటవీ శాఖ అనుమతి లేకపోవడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. రోడ్డు నిర్మాణానికి అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపడంతో రోడ్డు నిర్మించే ప్రాంతాన్ని డీఎఫ్‌వో పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి ఎంత మేర అటవీ భూమి అవసరం ఉంటుంది.. ఎన్ని చెట్లను కోల్పోవాల్సి ఉంటుంది తదితర వివరాలను సిబ్బందిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌డీవో భవానిశంకర్, జెడ్పీటీసీ మాన్‌సింగ్, సర్పంచ్ సంగ్లునాయక్ ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో కచ్చితంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ఆదేశించారు. గురువారం జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో విద్య, వైద్యం, ఐసీడీఎస్ శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సబ్జెక్టు పరంగా అవసరమైన ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు సన్న బియ్యంతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందిస్తున్న తరుణంలో ఎటువంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు అరికట్టడానికి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. విధిగా వారి పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఈవో గోవింద్‌నాయక్, జెడ్పీటీసీలు ఎర్రం యమున, బానోత్ కమల, భారతి, డీఈవో దుర్గాప్రసాద్, డీఎంహెచ్‌వో సుదర్శనం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందుతున్నాయి

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో 108, 102 వాహనాలతో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని జెడ్పీ చైర్మన్ తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన జెడ్పీ సమావేశంలో 108, 102 సేవల గురించి ప్రత్యేకంగా సమీక్షించారు. ఉత్తమ సేవలకు సంబంధించిన ఈఎం కేర్ బుక్ అందించారు.

గురువులే విద్యార్థులకు మార్గదర్శకులు

నిజామాబాద్ అర్బన్: గురువులే విద్యార్థులకు మంచి మార్గదర్శకులని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఘనత వారిదేనని జెడ్పీ చైర్మన్ విఠల్ రావు అన్నారు. గురువారం నగరంలోని విశ్వ వికాస్ పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. నగర మేయర్ నీతు కిరణ్, సుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి పాఠశాల ప్రిన్సిపాల్ సుస్మిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళలకు చెస్ పోటీలు



నిజామాబాద్‌నాగారం: సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఆధ్వర్యంలో ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ ఆవరణలో మహిళలకు చెస్ పోటీలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఆకుల లలిత హాజరయ్యారు. గెలిచిన వారికి ప్రత్యేకంగా బహుమతులతో పాటు అభినందనలు తెలిపారు. రేణుక కుమారి(బోధన్)-ప్రథమ, నమ్రత(ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల)- ద్వితీయ, మిశ్ర మేహరిన్(బోధన్)- తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఎన్‌వైకే కో-ఆర్డినేటర్ శైలి, చెస్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్, ఒలింపిక్ సంఘం కార్యదర్శి నర్స య్య, పీఈటీలు వెంకటేశ్వర్‌రావు,సునీల్, కృష్ణమూర్తి, కోచ్‌లు మహిపాల్‌రెడ్డి,ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌కు ఆహ్వానం



సిరికొండ: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన లొంక రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేను కలిసి వారు ఆహ్వాన పత్రిక అందజేశారు. సర్పంచ్ యెన్నం రాజారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరాలయంలో శివరాత్రి పూజలు

డిచ్‌పల్లి: ధర్మారం(బి)లోని ఉమామహేశ్వరాలయంలో స్వామివారికి మహాశివ రాత్రి సందర్భంగా పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రావుల బ్రహ్మానందం తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపా కటాక్షాలు పొందాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మాల మహానాడు నగర కమిటీ



నిజామాబాద్‌నాగారం: మాల మహానాడు నగర కమిటీ కార్యవర్గ సభ్యులను గురువారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు అనంపల్లి ఎల్లయ్య అధ్యక్షతన, రాష్ట్ర మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, జిల్లా కార్యదర్శి వినయ్ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎడ్ల ధనరాజ్, ప్రధాన కార్యదర్శిగా బట్టి గంగాధర్, తదితరులు ఎన్నికయ్యారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రితో రెవెన్యూ ఉద్యోగ సంఘం నేతలు

సుభాష్‌నగర్: రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు గురువారం రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల పలు పెండింగ్ సమస్యలపై చర్చించారు. అలాగే వీఆర్ఏలు ఎదుర్కొంటున్న పేస్కేల్, వారసత్వపు హక్కు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. సమస్యలపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి వీఆర్ఏల పేస్కేల్ రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని, వీఆర్ఏలతోపాటు రెవెన్యూ ఉద్యోగుల సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చినట్లు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతమ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి



లొంకలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం ఉషారాణి

సిరికొండ: ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో కాకుండా, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని నిజామాబాద్ ఆర్ఎం ఉషారాణి కోరారు. జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన లొంకను ఆర్ఎం గురువారం సందర్శించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బస్సులు నడపనుండటంతో రూట్ పరిశీలనకు ఆమె వచ్చారు. భక్తుల సౌకర్యార్థం జాతరకు తగినన్ని బస్సులు నడపనున్నట్లు ఆమె తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు ఆలయ ప్రాశస్త్యత, భక్తుల తాకిడి గురించి వివరించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



రామడుగులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ బాజిరెడ్డి, ఎంపీపీ సారికారెడ్డి

ధర్పల్లి: తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అన్నారు. మండలంలోని రామడుగు, చల్లగర్గ గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీపీ సారిక హనుమంతు రెడ్డితో కలిసి గురువారం భూమి పూజ చేశారు. సీఎం కేసీఆర్ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నారని బాజిరెడ్డి జగన్ తెలిపారు. వైస్ ఎంపీపీ నవీన్ రెడ్డి, మండలాధ్యక్షుడు మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పరితపించే వ్యక్తి ‘బాజిరెడ్డి’



సీడీ, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగన్, సుధాకర్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ప్రజల కోసం అనునిత్యం పరితపించే వ్యక్తి బాజిరెడ్డి గోవర్ధన్ అని, ఆయన మంచితనం ఒక ‘ఇజం’గా చూపెట్టడం బాగుందని బాజిరెడ్డి జగన్ అన్నారు. ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదినం సందర్భంగా కవి, రచయిత, జాగృతి నాయకులు నరాల సుధాకర్ రచించిన పాటను జగన్ నగర శివారులోని తన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..నరాల సుధాకర్‌కు బాజిరెడ్డి పట్ల ఉన్న అభిమానం పాటలో కనపడిందన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన



నిజామాబాద్ సిటీ: జిల్లాలోని కంటి వెలుగు కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రమేష్ రెడ్డి గురువారం పర్యవేక్షించారు. ఆయనతో పాటుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం సుదర్శనం, డిప్యూటీ డీఎండీ డాక్టర్ తుకారం రాథోడ్ ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ రెడ్డి ఎల్లమ్మ గుట్ట, పద్మశాలి సంఘంలో నడుస్తున్న కంటి వెలుగు కేంద్రాలను పర్యవేక్షించారు.

ఉచిత వినిడి పరీక్షల శిబిరం

నిజామాబాద్‌సిటీ: ఆర్‌బీఎస్‌కే, డీఈఐసీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన మీనాక్షి వెంకటరమణ్ ఫౌండేషన్ గురువారం జీజీహెచ్ డీఈఐసీ కేంద్రంలో వినికిడి పరీక్షలు నిర్వహించారు. 16 మంది పిల్లలకు పరీక్షలు చేశారు. అర్హులైన వారికి మార్చి 3న హైదరాబాద్‌లోని మీనాక్షి వెంకట రమణ్ ఫౌండేషన్‌లో ఉచితంగా వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,050	వెండి (కిలో)	70,000
22 క్యారెట్స్	53,511	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	14	25	క్యాప్సికం	30	50
బెండకాయ	50	80	గాజరుగడ్డ	20	40
బీరకాయ	50	60	పచ్చిమిర్చి	25	40
దొండకాయ	30	50	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	25	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	35	50	గోబిగడ్డ	10	20
వంకాయ	15	30	గోబిపువ్వు	20	40
పాలకూర	10	20	బీట్‌రూట్	20	40
మెంతికూర	15	30	గోరు చిక్కుడు	30	50
కొత్తిమీర	12	25	చిక్కుడుకాయ	30	50
పుదీనా	20	40			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1- సార్- 10.30,1.30,4.30,7.30 10.20
స్క్రీన్-2- షెహజాద్ -(హిందీ)-10.40,1.40 4.40,10.40
స్క్రీన్-3- అంటమన్ అయిడ్ దే వే -10.40 1.40,4.40,7.40,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1- అంటమన్ అయిడ్ దే వే-3డీ- 10.50, 1.40, 4.50,7.40,10.30
స్క్రీన్-2 - సార్ -10.10 4.00 7.00 10.00
అంటమన్ అండ్ దే వే -3డీ -1.10
స్క్రీన్-3- షెహజాద్ -(హిందీ)-9.55, 1.05 7.30,10.40
పఠాన్-(హిందీ)-4.15
స్క్రీన్-4- రైటర్ పద్మభూషణ్-10.55,4.50, 10.45
పఠాన్ -(హిందీ)-1.35, 7.30

దేవి	సార్
నటరాజ్	అంటమెన్(తెలుగు)
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	దేశం కోసం
విజయ్	వారసుడు

సంక్షిప్తం

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా సంతోష్

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా వైశాక్షి సంతోష్, నిజామాబాద్ కార్పొరేషన్ చీఫ్ ఆర్గనైజర్‌గా ముస్తఫా అల్కాఫ్, జిల్లా సేవాలాల్ యంగ్ బ్రిగేడ్‌గా సయ్యద్ యాకూబ్, హర్షద్ లు నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌లు నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామకపత్రాలను అందజేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు

ఇందల్వాయి: అన్సాన్‌పల్లిలోని మున్నూరుకాపు, గంగపుత్ర సంఘాల కమ్యూనిటీ భవన నిర్మాణాలకు ఎస్‌డీఎఫ్ నిధుల నుండి రూ.5లక్షల చొప్పున కేటాయిస్తూ సంబంధిత ప్రొసీడింగ్ కాపీలను ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కుల సంఘాల సభ్యులకు గురువారం అందజేశారు. టీఆర్ఎస్ నేతలు పులి శ్రీనివాస్, పులి సాగర్, తాటిపాముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

అంత్యక్రియలు

నిజామాబాద్‌నాగారం: దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ శ్మశాన వాటికలో కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన అనాథ శవానికి 6వ ఠాణా ఎస్సై సాయికుమార్ గౌడ్ అనుమతితో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలను నిర్వహించినట్లు సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు తెలిపారు. సంస్థ ఈసీ మెంబర్ సాయి తేజ, పోచ్చయ్య పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ కోచ్‌గా శ్యామ్

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే మన రాష్ట్ర జట్టుకు జిల్లాకు చెందిన పీఈటీ శ్యామ్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈ నెల 17 నుంచి 21 వరకు మంచిర్యాల్‌లో 41వ జాతీయ బాలబాలికల బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. మన రాష్ట్ర బాలుర జట్టుకు కోచ్‌గా ఆయన వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, తదితరులు ఆయన్ను అభినందించారు .

సైబర్ క్రైమ్‌పై అవగాహన



ప్లకార్డులతో ఉన్నత పాఠశాల విద్యార్థులు

డిచ్‌పల్లి: ధర్మా రం గ్రామ పంచాయతీ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంపీడీవో గోపిబాబు ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ వల్ల కలిగే అనర్థాలు వివరించారు. నేరాల బారినపడకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు, సూచనలు చేశారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ పత్తి మమత, కార్యదర్శి రాజలింగం, గ్రామస్తులున్నారు.